
సాక్షి బాపట్ల

బుధవారం, 2, అక్టోబర్, 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 588.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 10,120 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బగళాముఖి ఆలయ దర్శనం

చందోలు(కర్లపాలెం): శ్రీ బగళాముఖ అమ్మవారి ఆలయాన్ని కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు వెంకటేష్ మంగళవారం సందర్శించారు. అమ్మవారికి పూజలు చేశారు.



ఫ్రీడమ్ ఫైట్ పుస్తకావిష్కరణ

గుంటూరు వెస్ట్: డాక్టర్ సీఎస్ రావు ఫ్రీడమ్ ఫైట్ పుస్తకాన్ని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు.

సర్కారు మద్యం కిక్కు..

- ఈ నెల 9 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 11న జిల్లా కలెక్టర్ నేతృత్వంలో లాటరీ
- 12 నుంచే కొత్త దుకాణాలు ప్రారంభం
- సిండికేట్‌తోనే వేలం పాటలు
- బయటవారు వేలంలో పాల్గొనకూడదని హుకుం
- వేలంలో దుకాణం వచ్చినా ఏర్పాటు చేయనివ్వమంటూ బెదిరింపులు
- ప్రభుత్వ రాబడికి గండికొట్టి సొంత లాభం కోసం ఎత్తుగడ



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఎట్టకేలకు రెండేళ్ల కాలపరిమితితో నూతన మద్యం విధానాన్ని ఖరారు చేసిన రాష్ట్రప్రభుత్వం కొత్త మద్యం దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో జిల్లాలో 117 సాధారణ దుకాణాలు ఏర్పాటుకానున్నాయి. గీత కార్మికులకు 10శాతం కేటాయింపుపై ఇంకా నిర్ణయం జరగలేదు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఆన్‌లైన్, లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒకవ్యక్తి ఒక దుకాణం లేదా వేర్వేరు దుకాణాలకు ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చు. ఒక్కో దరఖాస్తుకు రూ.రెండు లక్షల చొప్పున నాన్ రిఫండబుల్ రుసుం చెల్లించాలి. క్రెడిట్, డెబిట్ కార్డులు లేదా బ్యాంకు చలానా రూపంలో రుసుం డీడీని ఎక్సైజ్ కార్యాలయాల్లో అందించాలి. వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఈనెల 11న జిల్లా కలెక్టర్ లాటరీ తీసి లైసెన్సులు కేటాయించ నున్నారు.

దుకాణం దక్కించుకున్న దరఖాస్తుదారుడు నిర్దేశిత లైసెన్స్ ఫీజులో తొలి వాయిదాను 24 గంటల్లో చెల్లించాలి. ఈనెల 12 తేదీ నుంచే లైసెన్సుదారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ నడుపుతున్న ప్రభుత్వం మద్యం దుకాణాల విధానం గడువు సోమవారంతో ముగిసినా కొత్త విధానం అమల్లోకి వచ్చేవరకూ పాత దుకాణాలు కొనసాగుతాయి.

ధరల పెంపునకు సిద్ధమైన పచ్చనేతలు

మరోవైపు మద్యాన్ని తక్కువ ధరలకే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా వేలం అనంతరం మద్యం ధరలను మరింతగా పెంచడంతోపాటు ఊరూరా బెల్టుషాపులు పెట్టి మద్యం అమ్మకాలను విస్తృతం చేసుకొని తద్వారా దోపిడీకి పాల్పడేందుకు పచ్చపార్టీ నేతలు సన్నద్ధమయ్యారు.

సిండికేట్‌తో పోటీకి రాకూడదు

మద్యం దుకాణాల కోసం ఎదురుచూస్తున్న అధికార పార్టీ నేతలు సామదాన దండోపాయాలు ప్రయోగించైనా సరే దుకాణాలు దక్కించుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఇందుకోసం నేతలు, మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారారు. తాము తప్ప మరెవ్వరూ మద్యం దుకాణాల వేలంలో పాల్గొనకూడదని ఇప్పటికే పచ్చనేతలు హుకుం జారీ చేశారు. కాదూకూడదని పాల్గొన్నా చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వేలంలో మద్యంషాపు దక్కినా.. దుకాణం పెట్టనిచ్చేది లేదని, మద్యం షాపును తమకు ఇవ్వాల్సిందేనంటూ పచ్చనేతలు ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో వేలంలో పోటీ పడేందుకు ఆశావహులు జంకుతున్నారు.

మద్యం దుకాణాల్లో పచ్చపార్టీ ముఖ్యనేతల వాటాల విషయం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే కొందరు నేతలు వాటాల వ్యవహారాన్ని ముగించగా మరికొందరు అదే పనిలో మునిగి తేలుతున్నారు. మద్యం సిండికేట్లలో ఆరితేరిన వ్యక్తులను ముందుపెట్టి వ్యవహారం నడిపిస్తున్నారు. కొందరు పచ్చనేతలు సిండికేట్‌లో భాగస్వాములుగా మారగా మరికొందరు సిండికేట్‌తో పనిలేకుండా వచ్చే లాభాల్లో పర్సెంటేజీలు కుదుర్చుకుంటున్నారు. ఒకరిద్దరు నేతలు తమ నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలకు మద్యం దుకాణాలు అప్పగిస్తున్నారు.

మొత్తంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పచ్చపార్టీ నేతలు మద్యం దుకాణాలను తమ స్వాధీనం చేసుకునేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు.

సిండికేట్‌తో ప్రభుత్వ రాబడికి గండి

పచ్చనేతలు సిండికేట్‌గా మారి ఇతరులెవ్వరూ మద్యం దుకాణాల వేలంలో పాల్గొనకుండా బెదిరింపులకు దిగడంతో ప్రభుత్వానికి రాబడి తగ్గనుంది. పేరుకు ఆన్‌లైన్, పారదర్శకత అంటూ కూటమి సర్కార్ గొప్పలు పోతుండగా పచ్చపార్టీ నేతలు మాత్రం మద్యం దుకాణాల వేలంపాటల్లో ఎవరినీ పాల్గొనకుండా బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో ఇతర పార్టీలకు చెందిన వారితోపాటు ఆశావహులు మద్యం దుకాణాలపై ఆసక్తి ఉన్నా పచ్చనేతల బెదిరింపులతో వేలం పాటల్లో పాల్గొనేందుకు వెనకడుగు వేస్తుండడంతో ప్రభుత్వ రాబడికి భారీగా గండిపడనుంది.

- బాపట్లలో ఇప్పటికే మద్యం సిండికేట్‌తో చర్చలు జరిపిన పచ్చనేత మొత్తం షాపుల్లో సగం షాపులు తనకు ఇచ్చేలా మాట్లాడుకోవడమే కాకుండా మిగిలిన షాపుల్లో వచ్చే లాభాల్లో 20 శాతం వాటా ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.
- వేమూరులో ఇదే తరహాలో సిండికేట్ మద్యంషాపుల విషయంలో పంపకాలు పెట్టగా రేపల్లెలో మంత్రి అనగాని ప్రధాన అనుచరులు మద్యం షాపుల పంపకాల వ్యవహారాన్ని ఇప్పటికే పూర్తిచేసినట్లు తెలుస్తోంది.
- పర్చూరులో పచ్చనేత అన్ని మద్యం షాపులను తన స్వాధీనంలో ఉంచుకొని కొందరు నాయకులకు మొక్కుబడిగా వాటాలు పెట్టినట్లు సమాచారం.
- అద్దంకి నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మద్యం షాపుల వ్యవహారాన్ని అనుచరులకు అప్పగించారు. దీంతో అనుచరులు మద్యం దుకాణాల వేలం పాటల్లో పాల్గొన కూడదని హెచ్చరికలు జారీచేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలోని ముఖ్యనేతలతోపాటు కొందరు క్రియాశీలక కార్యకర్తలకు మద్యం షాపుల్లో వాటాలు అప్పగించేందుకు సిద్ధమైనట్లు సమాచారం.
- చీరాలకు చెందిన పచ్చనేత ఇప్పటికే మద్యం సిండికేట్‌తో సమావేశమై ప్రతిపక్షపార్టీలకు చెందినవారు మద్యం వేలం పాటల్లో పాల్గొనకుండా చూడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మద్యంపై వచ్చే రాబడిలో 20 శాతం వాటా ఇచ్చేలా పచ్చనేత ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం.

పేదలకు పింఛన్‌తో కొండంత అండ

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- పంగులూరు బీసీ కాలనీలో పింఛన్ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి


జే.పంగులూరు: ఎన్టీఆర్ పింఛన్ భరోసాతో పేదలకు కొండంత అండ అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పంగులూరు బీసీ కాలనీలో మంగళవారం పింఛన్ పంపిణీ కార్యక్రమానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై పింఛన్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో బీసీ కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు, సీఎస్ఆర్ ఫండ్ నుంచి కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కుసుమ పథకం ద్వారా రైతులకు వ్యవసాయ బోరులకు విద్యుత్ 3 నుంచి 4 మెగావాట్ల విద్యుత్ సౌరశక్తి ద్వారా తయారు చేసేందుకు పథకం ఉపయోగపడుతుందన్నారు. విద్యుత్ వినియోగం ఎక్కువ అవుతున్న నేపథ్యంలో గృహాలకు విద్యుత్ అవసరాలు నిమిత్తం ప్రభుత్వ పథకం నుంచి సోలార్ విద్యుత్ తయారీకి చేయూతనివ్వనున్నట్లు తెలిపారు.

సమస్యలు ఏకరువు పెట్టిన రైతులు..

అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని రైతులకు డీఏపీ ఎరువులు దొరకం లేదని, దానికి రైతు సేవా కేంద్రాలకు తక్కువ ధరకు అమ్మే విధంగా చూడాలని మంత్రికి రైతులు విన్నవించారు. ప్రస్తుతం రైతులు పొగాకు వేస్తున్నారని, సాగర్ నీరు సరి గా అందటం లేదని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ నాగరాజారావు, ఎంపీడీఓ రామాంజనేయులు, హౌసింగ్ ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ధరణికోట పొలంలో బౌద్ధశిల్పాలు



అమరావతి: మండల పరిధిలోని ధరణికోట గ్రామ కోట దిబ్బల సమీపంలో కొమ్మినేని వెంకట్రావు పొలంలో బుద్ధుని యొక్క పాలరాతి శిల్పాలు బయటపడ్డాయి. గత కొద్ది రోజుల క్రితం పొలం దున్నతుండగా భూమి అడుగన పెద్ద బండరాయి ఉందనుకుని పొక్లెయిన్‌తో బయటకు తీయగా బౌద్ధశిల్పాలు వెలుగు చూశాయి. వెంటనే రైతు స్థానిక తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు, పురావస్తుశాఖాధికారులు సమాచారమిచ్చారు. అధికారులు శిల్పాలను పరిశీలించి పురావస్తుశాఖ ఉన్నతాధికారులకు తెలియపరిచి వారి ఆదేశాల మేరకు శిల్పాలను అమరావతి మ్యూజియానికి తరలించారు. స్థానిక పురావస్తుశాఖసిబ్బంది చినబాబు శ్రీనివాస్ గోపిరాజు పాల్గొన్నారు

పింఛన్ల పంపిణీ పరిశీలన



గుంటూరు రూరల్: మండలంలోని లాలుపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంపిణీలో అలసత్వం వహించకుండా అందరికీ సరైన సమయంలో అందించాలన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా క్లాప్ మిత్రలను సన్మానించారు. స్వర్ణాంధ్ర - 2047 కోసం క్యూఆర్ కోడ్ కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, ఈవో పీఆర్‌డీ కె శ్రీనివాసరావు, ఈవో మీనాక్షి, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ కె.సురేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 5,000 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 186, బ్యాంక్ కెనాల్‌కు 1,122, తూర్పు కెనాల్‌కు 105, పశ్చిమ కెనాల్‌కు 60, నిజాంపట్నం కాలువకు 116, కొమ్మమూరు కాలువకు 2,280 క్యూసెక్కుల వంతున నీటిని వదిలారు.

దాండియా నైట్.. సో క్యూట్..



నగరంపాలెం: స్థానిక ఇన్నర్‌రింగ్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ గుంటూరు ప్రేరణ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దాండియా నైట్ నిర్వహించారు. సుమారు 1,400 మహిళలు కోలాటం, దాండియా, గుజరాతీ డాన్స్, మ్యూజిక్, తంబాలా వంటి వాటికి ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అధ్యక్షురాలు దీప్తి నందమూరి, కార్యదర్శి దీప్తికా పాలిశెట్టి, కార్యదర్శి ఎం.చందన పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో పారా మెడికల్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడతగా ఆగస్టులో కౌన్సెలింగ్ నిర్వహించి కొన్ని సీట్లు భర్తీ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన వాటి కోసం ఈ నెల 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 14న కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తామని చెప్పారు. వివరాలకు గుంటూరు మెడికల్ కాలేజ్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

ఓటర్ల సర్వే 99.09 శాతం పూర్తి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: బాపట్ల జిల్లాలో ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ 99.09 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈఓ వివేక్‌యాదవ్ జిల్లా కలెక్టర్లతో సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని సర్వే వివరాలను జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి వివరించారు. జాబితాలో సవరణల కోసం 12,526 దరఖాస్తులు ఇప్పటివరకు అందగా 6,327 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వారంలాగా పరిష్కరిస్తామని చెప్పారు. అభ్యంతరాలపై 6,439 దరఖాస్తులు రాగా, 5,820 పరిష్కరించామని, మిగిలినవి రెండు రోజుల్లో విచారిస్తామన్నారు. 6,408 మంది బాపట్ల జిల్లాలో మృతి చెందినట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం 5,441 మంది మృతుల వివరాలను పూర్తిస్థాయిలో విచారించామన్నారు. మిగిలినవి త్వరలో పరిశీలిస్తామన్నారు. పర్చూరు ఎలక్టోరల్ అధికారిగా చంద్రశేఖర్ నియమితులైనందున దరఖాస్తుల విచారణకు లాగిన్ అనుమతులు ఇవ్వాలని కోరారు. వీక్షణ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, బాపట్ల ఆర్డిఓ పి.గ్లోరియా, ఏఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

అత్యాశే సైబర్ మోసాలకు కారణం

ఎస్పీ తుషార్ డూడీ



అవగాహన పోస్టర్

బాపట్లటౌన్ : అత్యాశే సైబర్ మోసాలకు కారణమని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. డబ్బులు ఎవ్వరికీ ఊరికేరావు..మీ కష్టార్జితం సైబర్ నేరస్తుల పాలు చేయవద్దన్నారు. అపరిచిత వెబ్ సైట్స్, ఏపీకే ఫైల్స్ క్లిక్ చేయవద్దన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. కొత్త వ్యక్తుల ఫోన్ నెంబర్ల నుంచి వచ్చే వెబ్‌సైట్స్ లింకులు, ఏపీకే ఫైల్స్ తెరవవద్దన్నారు. వేలల్లో పెట్టుబడులు, లక్షల్లో లాభాలు అంటూ వచ్చే వాట్సాప్, టెలిగ్రామ్ ప్రకటనలను నమ్మవద్దన్నారు. ఎదుటి వారి అమాయకత్వాన్ని, అత్యాశ అని సైబర్ నేరగాళ్ల ఆయుధంగా మారుతుందని, అత్యాశకు పోయి సైబర్ కేటుగాళ్ల వలలో పడవద్దన్నారు.

దసరా ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రులు ఆనం, అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం సమీక్షించారు. దుర్గాఘాట్‌లోని మోడల్ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమావేశానికి దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, గద్దె రామ్మోహనరావు, బొండా ఉమా, కలెక్టర్ జి.సృజన, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఈవో కేఎస్ రామరావు మంత్రు లు, ప్రజాప్రతినిధులకు వివరించారు. మంత్రి ఆనం మీడియాతో మాట్లాడారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు.

ఇంద్ర వైభవం

వేడుకకు వేళైంది.. శరన్నవ సంబరానికి సమయం ఆసన్నమైంది.. బెజవాడ ఉత్సవ శోభను సంతరించుకుంది.. 10 రోజులపాటు ఇంద్రగిరి భక్తజనఘోషతో మార్మోగనుంది.. విశేష అలంకారాలలో దుర్గమ్మ భక్తులను కటాక్షించనుంది.. గురువారం నుంచి ప్రారంభం కానున్న దసరా నవరాత్రి ఉత్సవాలకు ఇప్పటికే దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆలయ పరిసరాలు విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతున్నాయి.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



విద్యుత్ వెలుగుల్లో ఇంద్రకీలాద్రి ఆలయం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. గురువారం నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొలి రోజున అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం అనంతరం విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల తర్వాత ఉదయం 9 గంటలకు భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు.

ప్రత్యేక బస్సులు..

ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక, ఒడిశాల నుంచి పెద్దఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని విశేష అలంకారాలలో దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్, బస్టాండ్‌ల నుంచి దేవస్థానం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వీఐపీ టికెట్లతోపాటు రూ.300, రూ.100 క్యూలైన్లతోపాటు సర్వ దర్శనం ఏర్పాటు చేసింది. ఒకే దఫా భక్తులు 5 క్యూలైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకునేలా ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. వీవీఐపీలకు ప్రత్యేక సమయంతోపాటు వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించారు. వీఐపీల కోసం సీతమ్మ వారి పాదాలు, పున్నమీ ఘాట్ల నుంచి బస్సులను ఏర్పాటు చేశారు.

ఆర్జిత సేవలకు డిమాండ్..

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి ఖడ్గమాలార్చన, విశేష చండీహోమం, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన నిర్వహించనున్నారు. మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద ఖడ్గమాలార్చన, ప్రత్యేక లక్ష కుంకుమార్చన జరుగుతుంది. ఆలయ ప్రాంగణంలోని మల్లికార్జున మహా మండపం వద్ద ప్రత్యేక శ్రీచక్రనవార్చన, రాధాకృష్ణ విగ్రహం వద్ద నూతనంగా నిర్మించిన యాగశాలలో చండీహోమం నిర్వహిస్తారు.

25 లక్షల లడ్డూల తయారీ..

దసరా ఉత్సవాలలో అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేసే భక్తుల కోసం దేవస్థానం 25 లక్షల లడ్డూలను తయారు చేసేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం బుద్దా వారి గుడి వెనుక భాగంలో ఉన్న లడ్డూ పోటుతో పాటు కనకదుర్గనగర్ ఏనుగు షెడ్డులో లడ్డూలను తయారు చేసి ప్యాకింగ్ చేస్తున్నారు. మంగళవారం నుంచి ఉత్సవాలకు అవసరమైన లడ్డూలను తయారు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఉత్సవాలలో తొలి రోజైన బుధవారం నాటికి నాలుగు లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్నామని ఆలయ ఏఈవో పేర్కొన్నారు. భక్తులకు ప్రసాదాలను విక్రయించేందుకు గాను కనకదుర్గనగర్‌లో 11 కౌంటర్లతో పాటు బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో ఒక్కో కౌంటర్‌తోపాటు ఘాట్‌రోడ్డులో మరో కౌంటర్ ఏర్పాటు చేశారు.

దేదీప్యంగా దుర్గమ్మ కొండ

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిని రంగురంగుల విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి ఆలయానికి చేరుకునే కెనాల్‌రోడ్డుతో పాటు కుమ్మరి పాలెంలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అక్కడి నుంచి అమ్మవారి ఆలయానికి చేరుకునే ఘాట్‌రోడ్డు, కనకదుర్గనగర్, గోశాల, మహా మండపం పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మూడు మార్గాల్లో కొండ దిగువకు..

అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు కొండ దిగువకు చేరేందుకు మూడు మార్గాలను ఏర్పాటు చేశారు. మల్లేశ్వరస్వామి వారి ఆలయం మెట్లతోపాటు ఈ దఫా మహా మండపంలోని క్యూలైన్ల ద్వారా భక్తులను కొండ దిగువకు అనుమతిస్తారు. మహామండపం ఎదుట నూతన భవన నిర్మాణం జరుగుతుండటంతో మల్లేశ్వరస్వామి వారి ఆలయం వద్ద మెట్లను తొలగించారు. వాటి స్థానంలో ఐరన్ మెట్లను ఏర్పాటు చేయగా, వాటిపై సాధ్యమైనంత తక్కువ మందినే అనుమతించాలని దేవస్థానం నిర్ణయించింది. అత్యవసర పరిస్థితులలో మహా మండపం లిఫ్ట పక్కనే ఉన్న మెట్లను సైతం వినియోగంలోకి తీసుకురావాలని ఆలయ అధికారులు నిర్ణయించారు.

కొలిక్కిరాని పనులు..

అమ్మవారి దర్శనానికి భక్తులు విచ్చేసే క్యూలైన్లు కొన్నిచోట్ల ఇంకా పనులు కొనసాగుతున్నాయి. కుమ్మరిపాలెం వైపు నుంచి వచ్చే భక్తులు క్యూలైన్‌లో కలిసేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. దుర్గాఘాట్, ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు వద్ద రిటైనింగ్ వాల్ విరిగిపడిన ప్రదేశంలో క్యూలైన్లు నిర్మించాల్సి ఉంది. బుధవారం మధ్యాహ్నానికి మిగిలి ఉన్న పనులు కూడా పూర్తవుతాయని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

డిజిటల్ డ్యూటీ పాస్‌లు

ఈ ఏడాది డిజిటల్ డ్యూటీ పాస్‌లను దేవస్థానం జారీచేసింది. అమ్మవారి ఆలయంలోని అధికారులు, ఉద్యోగులతోపాటు కింది స్థాయి ఉద్యోగులకు సైతం డిజిటల్ కార్డులను జారీ చేశారు. ఆలయ ఉద్యోగులతోపాటు పోలీసు, రెవెన్యూ ఇతర ప్రభుత్వ శాఖలతో పాటు మీడియా ప్రతినిధులకు సైతం ఇవే కార్డులు జారీ చేస్తున్నారు. ఈ ఏడాది డ్యూటీ పాస్‌లపై దర్శనాలను పూర్తిగా అరికట్టేందుకు దేవస్థానం డిజిటల్ కార్డులను జారీ చేస్తోంది.

క్లుప్తంగా

వాహనాలు నడిపే మైనర్లపై చర్యలు తీసుకోండి



రేపల్లె రూరల్: రేపల్లె పట్టణంలో మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నందున కౌన్సెలింగ్ నిర్వహించాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్స్ నేషనల్ కో ఆర్డినేటర్ పిన్ని సాంబశివరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఇలాంటి మైనర్లపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో దొంగతనాలు ఎక్కువైనందున పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయడం లేదని, మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ అండ్ టీఎస్ స్టేట్స్ మీడియా ప్రెసిడెంట్ కారుమూరు హనోక్ బాబు, సభ్యులు ఎల్.సుధాకర్, జి.ముత్తయ్య, ఆర్.యాకోబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గాయత్రి



వేటపాలెం: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని కే గాయత్రి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఫణికుమార్ మంగళవారం తెలిపారు. విద్యార్థినిని పీఈటీ కోటేశ్వరమ్మ, జే శ్రీవాణి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ఏఎన్‌యూ స్పోర్ట్స్ క్యాలెండర్ విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ క్రీడా బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం రూపొందించిన 2024 -25 వార్షిక స్పోర్ట్స్ క్యాలెండర్‌ను మంగళవారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. అనుబంధ కళాశాలలు షెడ్యూలు ప్రకారం ఆయా క్రీడలను నిర్వహించాలన్నారు. రెక్టార్ ఆచార్య కె. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వ్యాయామ విద్యాశాఖ డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, వ్యాయామ విద్య కళాశాల యోగా విభాగం కో ఆర్డినేటర్ డి. సూర్యనారాయణ పాల్గొన్నారు.

చివరి భూములకూ సాగునీరు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ఆయకట్టు చివరి భూములన్నింటికీ సాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. 5వ నీటి పారుదల సలహా మండలి సమావేశం మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. కృష్ణా పశ్చిమ డెల్టా, సాగర్ కాల్వల కింద ఉన్న భూముల్లో పంటలు పండటమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో బాపట్ల జిల్లాలోని 3,79,997 ఎకరాలకు 45.97టీఎంసీల నీరు అవసరం అవుతుందన్నారు. ఇప్పటికే 18 టీఎంసీలు విడుదల అయిందన్నారు. ఏప్రిల్ నెల వరకు కావాల్సిన నీటి గురించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. ప్రస్తుతం సాగునీరు పుష్కలంగా విడుదలవుతున్నప్పటికీ చివరి భూములకు చేరడం లేదన్నారు. కాల్వల మరమ్మతులు, పూడికతీత పనులను అధికారులు శరవేగంగా చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాలకు కాల్వలు దెబ్బతినడంతో తాత్కాలిక పునరుద్ధరణ పనులకు అధికారికంగా ఆమోదించామన్నారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ 18వ మైలు వద్ద 800 క్యూసెక్కులు మాత్రమే విడుదల కావడంపై ఆరా తీశారు. సామర్థ్యం పెరిగేలా కృషి చేయాలన్నారు. లస్కర్లు లేనందున దిగువ ప్రాంతాలలోని ఆయకట్టు భూములకు నీరు చేరడం లేదని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్.. 128 లస్కర్ పోస్టులకుగాను కనీసం కొన్ని చోట్ల సచివాలయాల సిబ్బంది ద్వారా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి తీరువా వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన సొమ్ముతో లస్కర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కృష్ణా పశ్చిమ డెల్టా కింద కారంచేడు మండలంలోని 19,797 ఎకరాలకు సాగునీరు ఇస్తున్నప్పటికీ అధికారికంగా నమోదు కాకపోవడంపై ప్రశ్నించారు. ఆయకట్టు భూముల స్థిరీకరణ ప్రకటన ప్రక్రియ చేపట్టాలన్నారు. గుండ్లకమ్మ నది జలాశయంపై 9 గేట్లు కొత్తగా ఏర్పాటు చేశామని, మిగిలినవి నవంబర్ లోపు ఏర్పాటు చేస్తామని ఇంజినీర్లు ఆయన దృష్టికి తెచ్చారు. స్వర్ణ లాక్‌ల వద్ద నిలిచిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నీటి సంఘాల ఎన్నికలు చట్టబద్ధంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పంట కాల్వలతోపాటు గట్లు బలోపేతం చేయాలని బాపట్ల శాసనసభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. కృష్ణానది పశ్చిమ డెల్టా కింద బాపట్ల నియోజకవర్గంలోని దిగువ ప్రాంతాలకు సాగునీరు అందడం లేదన్నారు. ఉపాధి హామీ పథకం నిధులను అనుసంధానిస్తూ పంట కాల్వల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, జల వనరుల శాఖ ఎస్ఈ అబూతలీమ్, ఈఈలు వెంకటరత్నం, మురళీకృష్ణ, డీఈలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు పెదకాకానిలో 'దేవర' సక్సెస్ మీట్



స్థల పరిశీలన చేస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

పెదకాకాని: జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్రం సక్సెస్ మీట్ ఈ నెల 3వ తేదీన పెదకాకాని మండలం నంబూరు వద్ద నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్గనైజర్స్ శ్రీయాస్ మీడియా యజమాని శ్రీనివాసరావు తెలిపారు. నంబూరు అడ్డరోడ్డు సమీపంలో వేడుక నిర్వహించే ప్రదేశాన్ని మంగళవారం మంగళగిరి నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, పెదకాకాని సీఐ టి. నారాయణస్వామి, ఎస్ఐ షేక్ మిరాజ్, నంబూరు హరి (ట్రాక్టర్ కంపెనీ) తదితరులు పరిశీలించారు. బందోబస్తు, పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు.

త్వరలో నగరంలో పోలీస్ 'షీ బృందాలు'

నగరంపాలెం: త్వరలో గుంటూరు నగరంలోని కళాశాలలు, పాఠశాలల వద్ద మఫ్టీలో, యూనిఫాంలో షీ బృందాలు విధుల్లో ఉంటాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. గుంటూరు నగరంలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యజమానులతో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. గత నెలలో నిర్వహించిన సమావేశంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలకు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకున్నామని అన్నారు. పాఠశాలలో, కళాశాలలో ఏదైనా ఘటన జరిగితే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100, 86888 31568 నంబర్లకు సమాచారం అందించాలని అన్నారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య ఉంటే కూడా పోలీసుల దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు అబ్దుల్ అజీజ్ (తూర్పు), జయరాం ప్రసాద్ (పశ్చిమ), బి.సీతారామయ్య (ఎస్‌బీ), తూర్పు, పశ్చిమ ట్రాఫిక్ సీఐలు ఎ.అశోక్‌కుమార్, సింగయ్య, ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ శ్రేణుల దాడి

గుంటూరు: పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడులు, దౌర్జన్యాలు ఆగడం లేదు. మాచవరం మండలంలోని తురకపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు మంగళవారం దాడులకు తెగబడ్డారు. గ్రామ సర్పంచి షేక్ అలాబక్షు, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ రఫీ తదితరులు ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాన్ని విడిచి ఇతర ప్రాంతాల్లో, బంధువుల వద్ద తలదాచుకుంటున్నారు. పక్షం రోజుల క్రితం వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ రఫీ గ్రామానికి వచ్చాడు. ఇంట్లో ఉన్న సమయంలో టీడీపీ నాయకులు కొందరు రఫీపై దాడిచేసి తమపైనే దాడి చేశారంటూ పోలీసులకు రఫీపై ఫిర్యాదు చేశారు. రఫీపై అక్రమ కేసులు బనాయించి కోర్టులో హాజరు పరిచారు. బెయిల్‌పై గ్రామానికి తిరిగి వచ్చిన రఫీపై మరోసారి దాడిచేసి దుకాణం తాళాలు తెరవద్దంటూ హుకుం జారీ చేసి దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని గ్రామ సర్పంచి షేక్ అల్లాబక్షు, రఫీలను దాచేపల్లి పోలీసు కార్యాలయానికి తరలించినట్లు సమాచారం.

4న వినుకొండలో జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి శిక్షణ సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన వినుకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు మంగళవారం తెలిపారు. జాబ్ మేళాకు శ్రీదత్తా హాస్పిటల్, మాస్టర్ మైండ్స్, ఐలా అగ్రి సర్వీసెస్, సింధుజ మైక్రో క్రెడిట్స్ వంటి సంస్థలు హాజరై అర్హులైన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని వివరించారు. జాబ్ మేళాకు 10వ తరగతి నుంచి పీజీ, డిప్లొమో, బీటెక్, ఫార్మసీ విద్యార్హత ఉన్న నిరుద్యోగ యువత నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. వివరాలకు డి.జానీబాషా 9951214919, జె.సురేష్ 9100566581 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ సీ అండ్ బీ ఏఈఈగా హిమబిందు



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఏఈఈగా బి.హిమబిందు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. హిమబిందు మాచర్ల పీడబ్ల్యూడీ కాలనీలో క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఏఈఈగా విధులు నిర్వహించి సాగర్‌కు బదిలీపై వచ్చారు. అలాగే ఇప్పటి వరకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ ఏఈఈగా పనిచేసిన కేవీ కోటేశ్వరరావు మాచర్ల ఓఅండ్ఎం డివిజన్ డిజైన్స్‌కు బదిలీ అయ్యారు. మెయిన్ కెనాల్ మానిటరింగ్ ఏఈఈగా వెంకట సుబ్బయ్య, సాగర్ ప్రాజెక్ట్ గేట్స్ ఏఈఈగా అనిత శ్రీ బాధ్యతలు చేపట్టారు. వాటర్ సప్లై ఏఈఈగా పనిచేసిన లక్ష్మీనారాయణ దుగ్గిరాలకు, మెయిన్ కెనాల్ మానిటరింగ్ ఏఈఈ యుగంధర్ వినుకొండకు, సాగర్ ప్రాజెక్ట్ గేట్స్ ఏఈఈ బాబూమియా నెల్లూరులోని సోమశిల ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు.

అండర్-17 జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన బాలుర హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు

తెనాలి: గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో మంగళవారం అండర్-17 బాలుర హ్యాండ్‌బాల్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. 80 పాఠశాలల నుంచి 80 మంది పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరచిన 16 మందిని ఎంపిక చేశారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు రాజమహేంద్రవరంలో రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు జిల్లాకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. గుంటూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శి సీహెచ్ వినయ్‌కుమార్, కోచ్ కె.నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు కిషోర్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



చీరాల: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చీరాల మండలం కొత్తపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కర్లపాలెం మండలం మర్రికట్టవ గ్రామానికి చెందిన మరక ఏసమ్మ (50) నాలుగు నెలల క్రితం చీరాల మండలం గవినివారిపాలేనికి చెందిన నక్కల వెంకట్రావు వద్ద సుమారు 150 గొర్రెల దగ్గర కాపలా పని నిమిత్తం చేరాడు. ఈ క్రమంలో కొత్తపాలెం గ్రామానికి చెందిన వారి పొలంలో సుమారు 20 రోజులు నుంచి గొర్రెలు కాసుకుంటున్నారు. మంగళవారం ఉదయం పొలంలోని జీడిచెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి మృతి పట్ల కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

క్రోసూరు ఫైర్ స్టేషన్ పునఃప్రారంభం



క్రోసూరు: క్రోసూరు ఫైర్ స్టేషన్ (అవుట్‌పోస్టు) మంగళవారం పునఃప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా ఫైర్ సేఫ్టీ అధికారి ఎస్.శ్రీధర్ పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు నియోజకవర్గంలోని క్రోసూరు, అచ్చంపేట , బెల్లంకొండ శివారు, అమరావతి మండలంలోని ధరణి కోట వరకు, పెదకూరపాడు మండలంలోని 10 గ్రామాలకు అందుబాటులో ఉంటుందని అన్నారు. సర్వీస్ ప్రొవైడర్ ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సహకారంతో అవుట్ పోస్టు ప్రారంభించినట్లు చెప్పారు. ఏఎఫ్ఓ సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలు తమకు ఏదైనా అగ్నిప్రమాదాలు సంభవించిన పుడు తక్షణమే ఫోను 08640- 227848కు ఫోను చేయవచ్చునన్నారు.

అంతర్జాతీయ పోటీలకు తెనాలి పవర్ లిఫ్టర్

మంగళగిరి: ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు సౌతాఫ్రికాలో జరగబోయే కామన్‌వెల్త్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనే ఇండియన్ టీమ్‌లో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య చోటు దక్కించుకున్నారు. జూనియర్ ప్లస్ 84 కేజీల విభాగంలో ఆమె అర్హత సాధించారు.

వరి సాగులో విత్తన ఎంపికే కీలకం



బేతపూడిలో పొలాన్ని పరిశీలిస్తున్న హరిత

రేపల్లె రూరల్: వరి సాగులో విత్తన ఎంపిక కీలకమని బాపట్ల వ్యవసాయ పరిశోధనా కేంద్రం జన్యు ప్రజనన విభాగపు అధికారి టి.హరిత చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని బేతపూడి 1, 2 గ్రామాలలో మంగళవారం క్షేత్ర పర్యటనలో ఆమె పాల్గొన్నారు. రైతులకు సూచనలు చేశారు. బీపీటీ-5204కు ప్రత్యామ్నాయంగా అనేక రకాలు ఉన్నాయని పేర్కొన్నారు. బీపీటీ 2846, 2782 రకాలతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. బ్లాక్ రైస్, రెడ్ రైస్ వంటి రకాలను సాగు చేయటంతో అనేక ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. మధుమేహం, క్యాన్సర్, హృద్రోగ సమస్యలను ఎదుర్కొనే రోగ నిరోధక శక్తి వీటి ద్వారా పెరుగుతుందని చెప్పారు. ఐరన్, పీచు పదార్థాలు అధికంగా లభిస్తాయని పేర్కొన్నారు. రైతులు తమ సందేహాలను వ్యవసాయ అధికారులకు తెలిపి నివృత్తి చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఆర్.విజయ్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి రైతును సాంకేతిక సమాచార పరిజ్ఞానవంతుడిగా తయారు చేయటమే పొలం పిలుస్తోంది కార్యక్రమ ఉద్దేశమన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో ఎ.వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ అనూష, డిజిటల్ అసిస్టెంట్ ఎస్.హారిక, ఏఈవో బి.తేజస్వి ని, వీపీఏలు పి.ప్రసాద్, కె.రాయల్‌బాబు, వెటర్నరీ అసిస్టెంట్ రెడ్డి, ఫిషరీస్ అసిస్టెంట్ ఎస్.నాగపావని, వీఆర్ఏ షేక్ ఆదమ్‌షఫీ, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లేక భవన నిర్మాణ కార్మికుల అవస్థలు



ఆందోళన నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని సక్రమంగా వెంటనే అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ఆర్డీవో కార్యాలయ ఆవరణలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉచిత ఇసుక హామీ అమలు కాకపోవడంతో రాష్ట్రంలో లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవటంతో వారు పస్తులు ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికలలో హామీ ఇచ్చినట్లుగా కార్మికుల స్కీములన్నీ అమలు చేయాలన్నారు. ఉచిత ఇసుక ఆన్‌లైన్ విధానంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. కొన్నిచోట్ల ఇసుక బదులు మట్టి వస్తోందన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నాగయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు జి.శ్రీమన్నారాయణ, దాసరి శ్రీనివాసరావు, బాబు నాంచారయ్య, కాళిదాసు, తోట పూర్ణచంద్రరావు, మేఘదాసు, కోటేశ్వరరావు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

రేపల్లె రూరల్: ఏపీఎస్ ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. పట్టణంలోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాలులో మంగళవారం నిర్వహించిన యూనియన్ రేపల్లె డిపో సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి రోజు సుమారు 35 లక్షలు మందికి రవాణా సౌకర్యాన్ని అందిస్తున్న ఆర్టీసీలో అన్ని విభాగాల్లోని పదివేల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. 2022 నుంచి ఆపిన నైట్ అవుట్ - డైలీ అలవెన్సులు పునరుద్ధరించాలని కోరారు. పదోన్నతలు కేసును వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యము కల్పించేలోపు డిపోలలో బస్సుల సంఖ్యను పెంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నెల్లూరు జోనల్ అధ్యక్షుడు వాకా రమేష్, ఈయూ రాష్ట్ర సహాయ కార్యదర్శులు బిటి వల్లి, జీఎస్ నారాయణ, బాపట్ల జిల్లా అధ్యక్షుడు పసుపులేటి చిరంజీవి, జిల్లా కార్యదర్శి వై.శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా ఏపీజేఏసీ అమరావతి ఉమెన్ వింగు చైర్‌పర్సన్ పి.రజని, జోనల్ - జిల్లా కమిటీ నాయకులు రేపల్లే డిపో ఈయూ అధ్యక్షుడు కె.బ్రహ్మయ్య, కార్యదర్శి పి.కమలాకర్, సీసీఎస్ డెలిగేట్ ఎస్.శ్రీనివాసరావు, గ్యారేజ్ సెక్రటరీ మౌలాఖాన్, జోనల్ కమిటీ నాయకుడు కేఎస్‌వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ



గంటా దేవదత్తు

బాపట్ల టౌన్: జిల్లాలోని మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి గంటా దేవదత్తు తెలిపారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024-26 కాలానికి దుకాణాల ఏర్పాటు కోసం జిల్లాలోని బాపట్ల, వేమూరు, రేపల్లె, నగరం, చీరాల, అద్దంకి, పర్చూరులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఈ నెల 11న ఉదయం 11 గంటలకు పట్టణంలోని ఎంఎస్ఆర్ కళ్యాణమండపంలో లాటరీ విధానంలో జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి దుకాణాలు కేటాయిస్తామని వివరించారు. పొందిన వ్యక్తులు ఈ నెల 12 నుంచి దుకాణాలు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. 10 వేల జనాభా కలిగిన ప్రాంతాల్లో ఏడాదికి రూ. 50 లక్షలు, 50 వేల లోపు జనాభా ఉంటే రూ. 55 లక్షలు, 5 లక్షలలోపు జనాభా కలిగిన ప్రాంతాల్లో రూ. 65 లక్షలు, ఆపైన జనాభా ఉంటే రూ. 85 లక్షల వంతున రుసుములు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విజయనగరంలో ఈ నెల 6, 7, 8వ తేదీల్లో జరగనున్న ఏపీటీఎఫ్ 20వ విద్యా, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం నగరంపాలెంలోని సంఘ జిల్లా కార్యాలయంలో మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వేళాంగిణిరాజు, కె. నరసింహారావు, జిల్లా సహాధ్యక్షుడు ఓ. నాగార్జున, అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.సాయన్న, నాయకులు ఆనంగి శ్రీనివాస్, జె. విజయానంద్, జీఎస్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సరఫరాలో ఇబ్బందులు తీర్చాలి

జిల్లా కలెక్టర్‌కు క్రెడాయ్ ప్రతినిధుల వినతి



ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

గుంటూరు వెస్ట్: ఇసుక అందుబాటులో లేకపోవడంతో జిల్లాలో నిర్మాణ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటుదని క్రెడాయ్ ఏపీ చైర్మన్ ఆళ్ళ శివారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ.. నిర్మాణ రంగంతోపాటు కార్మికులు కూడా ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఇసుక రీచ్‌లను త్వరగా ప్రారంభించి కష్టాలు తీర్చాలని కోరారు. స్పందించిన కలెక్టర్ 10, 15 రోజుల్లోనే ఇసుక రీచ్‌లు ఓపెన్ చేయించనున్నట్లు హామీ ఇచ్చారు. క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.వినోద్ రెడ్డి, వి.శివనాగేశ్వరరావుతోపాటు పి.సాహిత్, ఎం.శంకర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా ఓటరు కార్డుల ప్రక్రియ

గుంటూరు వెస్ట్: స్పెషల్ సమ్మరీ రివిజన్ -2025కు సంబంధించి ఓటర్ల జాబితా ఇంటింటి వెరిఫికేషన్‌తోపాటు ఇతర అంశాలను నిర్దేశించిన సమయంలో పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ నిర్వహించిన వీడియో సమావేశంలో స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ.. ఇంటింటి ఓటరు వెరిఫికేషన్ 99.56 శాతం పూర్తయ్యిందన్నారు. దరఖాస్తులను వెరిఫికేషన్ చేసి ఈ నెల 5 నాటికి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. మరణించిన వారి పేర్లు మార్గదర్శకాల ప్రకారం తొలగించాలన్నారు. బూత్‌ల జియో మ్యాపింగ్ అప్‌డేట్ తోపాటు రేషనలైజేషన్, ఇతర మార్పులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వివరాలు సేకరించాలని సూచించారు. జిల్లాలో ఈఆర్వోల వివరాలు అప్‌డేట్ చేవామన్నారు. బదిలీలు పూర్తయిన వెంటనే ఏఈఆర్వోలు, బీఎల్వోలవి అప్‌డేట్ చేస్తామని చెప్పారు. ఉన్నత విద్యా సంస్థల్లో ఓటర్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనికి ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించామని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం స్పెషల్ సమ్మరీ రివిజన్ -2025 ఓటర్ల జాబితా రూపొందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, గంగరాజు, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.